


# రాణీవాసం

అంతా కొత్తగా, గమ్మత్తుగా వుంది. ఆర్నెలల్లో ఎంత మార్పు? ఎన్ని సంఘటనలు. నెల రోజుల వ్యవధిలో సంబంధం చూడటం, పెళ్ళి జరగడం. మరో రెణ్ణెలల్లో కాపురానికి రావడం..అతికష్టం మీద అత్తగారింట్లో మూణ్ణెల్లు.. నిన్నటికి నిన్న కొత్తకాపురం.

ఇది నా ఇల్లు. నా ప్రవీణ్. నా జీవితం. ఈ రాజ్యానికి నేనే రాజ్ఞిని. ఆంక్షలు పెట్టేవాళ్ళు, పని చేయకపోతే అడిగేవాళ్ళూ లేరు. ఇష్టం వుంటే పనిచేయడం, లేని రోజు ప్రవీణ్‌తో శెలవు పెట్టించేసి బైటికి చెక్కేయడం, ఎంత సుఖం? ఈ మాత్రం సుఖం కోసం ఎన్ని పోరాటాలు చేయాల్సొచ్చింది? అబ్బ! తల్చుకుంటేనే బాధేస్తోంది. నేనేనా! ఇన్ని కష్టాలు పడ్డానా అని ఆశ్చర్యమేస్తోంది. ఆర్నెలల కాలం జిగురులాంటి సీరియల్‌లా తెగ సాగింది. గుర్తొస్తూనే వుంది.

* * *

"అమ్మా మణిచందనా! ఇది మన ఇల్లు. స్వేచ్ఛగా, సంతోషంగా వుండు. మా వాణ్ణి జాగ్రత్తగా చూసుకో! కొత్త కదా! తొందరలోనే నిన్ను మేము, మేము నిన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం. వంట వచ్చు కదూ నీకు!" పెళ్ళయిన మర్నాడు దగ్గర కూర్చోపెట్టుకుని అడిగింది అత్తగారు, అదే ప్రవీణ్ తల్లి.

"వంటా! ఉహూ! నాకు రాదత్తయ్యా!" వసంతక్క చెప్పమన్నట్లుగా చెప్పాను. 'వచ్చు అని చెబితే ఉద్యోగస్థురాలైన అత్తగారు పనిమొత్తం నీ నెత్తినే రుద్దుతారే! రాదని చెప్పెయ్యి' అంది వసంతక్క.

"ఏం ఫర్లేదు! మీ చదువులు, కంప్యూటర్ క్లాసులు - ఈ గోలతో పని నేర్చుకునే వ్యవధి ఎక్కడుంటుందీ? మీ ఆడబిడ్డక్కూడా ఇదే సమస్య. ఎటొచ్చీ నేనే పనిగట్టుకుని దగ్గరుండి నేర్పించాను. అదీ, నేనూ నేర్పుతాంలే! భయపడకు" నవ్వేసింది అత్తయ్య.

'నేతిబీరలో నెయ్యిలాంటిదే అత్తగారిలోని మంచితనం' అన్న వసంతక్క మాటలు అబద్ధమేమో అనిపించాయి నాకు. మధ్యాహ్నం అమ్మకి ఫోన్ చేస్తేగానీ నాకు జ్ఞానోదయం కాలేదు.

"పిచ్చిపిల్లా! మీ అత్తగారి మాటల్లో రెండు శ్లేషలున్నాయి. ఒకటి నీకు పని నేర్పి తను రెస్టు తీసుకోవడం, రెండోది తను తన కూతురికి పని నేర్పినట్లూ, నేనేమో నిన్ను దద్దమ్మలాగా పనికిరానిదాన్ని చేసినట్లు. జాగ్రత్తగా వుండవే మణీ! అంతా మనలాగా స్వచ్ఛంగా వుండరు. ఊరికే పొంగిపోయి పనుల్లో దూరకు"

ఇదే విషయాన్ని వసంతక్కకి కూడా చెప్పాను. వసంతక్క మా పెద్దమ్మ కూతురు. నాకు అన్నయ్య తప్ప వేరే తోబుట్టువులు లేరు. అందుకే వసంతక్కంటే నాకు ప్రాణం.

"మీ అమ్మ చెప్పింది నిజమేనే! మీ అత్తగారు ఉద్యోస్థురాలు. ఆడబడుచేమో ఇంకా రెండేళ్ళు చదివితే కానీ, ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకోదు. లంకంత ఇల్లు. ఇంట్లో అందరూ బైటికి వెళ్ళేవాళ్ళే! నీకు ఉద్యోగం వచ్చేవరకూ నువ్వొక్కదానివే ఇంట్లో. ఇక ఇంటిపని మొత్తం నీకు అంటగట్టి వాళ్ళు ఊరేగుతారు. జాగ్రత్త"

"మరేం చెయ్యనక్కా!" బేలగా అడిగాను.

"ఏముందీ? మీ ఆయన్ని నీ మాట వినేటట్లు చేసుకో! ఆయన జీతం వగైరాలన్నీ నీ అదుపులో వుండేట్లు చూసుకో! అలా అని మరీ మొండితనం చెయ్యకు. నేను చెప్పేదేముందిలే? కాస్త ఆలోచిస్తే నీకే అర్థమవుతుంది. వచ్చే ఏడాదికల్లా నేను, మీ బావగారు మీ సొంత విడికాపురం చూడ్డానికి వచ్చేటట్లుగా ఏర్పాటు చేసుకో!"

ఆలోచించాను. ఎప్పుడో చిన్నప్పుడు తెన్నేటి సూరిగాడు రాసిన చంఘిజ్‌ఖాన్ నవల గుర్తొచ్చింది. అందులో చంఘిజ్‌ఖాన్ భార్య 'బుర్టే' పాత్ర నాకు ఆదర్శమేమో అనిపించింది. అంతటి మహావీరుడూ భార్యా మోహంలో పడి తల్లిని కొంతకాలం దూరం చేస్తాడు. అమాయకంగా కనిపిస్తూనే తేనె పూసిన కత్తిలా అత్తగారి గుండెల్ని పిండేస్తుంది బుర్టే. మరుదుల్ని మంచి చేసుకుని కన్నతల్లినే కష్టపెట్టేలా చేస్తుంది. ఆఖరికి నిజం బయటపడి భార్యకు బుద్ధి చెప్తాడు చంఘిజ్‌ఖాన్. అయితే, అంతటి వివేకం సాధారణ మగాళ్ళలో వుంటుందని నేననుకోను. అంతే! ఆచరణలో పెట్టేశాను.

* * *

"ఈ చొక్కా ఏమిట్రా బఫూన్స్ వేసుకునే దానిలాగా ఈ పెద్ద, పెద్ద బొమ్మలేవిటి? సిగరెట్టే అలవాటు లేని నాకు ఈ యాష్ ట్రే గిఫ్ట్ ఏమిటి?" మావగారి విసుగు.

"చీర బాగానే వుంది కానీ నా వయసుకి నప్పదేమోరా! మరీ ఇంత పలుచని జార్జెట్‌వి నేనెప్పుడో మానేశాను. ఎందుకురా అనవసరంగా ఖర్చుపెట్టుకున్నావు?" అత్తగారి అక్షింతలు.

"ఒరేయ్ అన్నయ్యా! డ్రస్ సూపర్బ్! కాకపోతే నేను ఓ నాలుగేళ్ళు చిన్నదాన్నయిపోతే కానీ పట్టదనుకుంటా! ఇదిగో వదినా, ఎలాగో ఎక్కించాను కానీ, ఒంటిమీది నుంచీ మరి ఊడి రావట్లేదు కాస్త హెల్ప్ చెయ్యవూ!" కొత్తడ్రస్ తొడిగి గదిలోనుంచీ ఆడబడుచు ప్రణీత పిలుపులో వెక్కిరింత.

ఇవన్నీ నేను వీళ్ళకోసం, ప్రవీణ్ వారిస్తున్నా వినకుండా కొన్న బట్టలు. ఈ సూటిపోటి మాటలకి నా కళ్ళలో గిర్రున నీరు తిరిగాయి. గదిలోకొచ్చి ఏడుపు మొదలెట్టాను. ప్రవీణ్ నాతోపాటే వచ్చి చాలాసేపు బ్రతిమిలాడాడు. ఆ తర్వాత వాళ్ళ అమ్మతో అన్న మాటలు వినిపించి నాకు నేనే కంగ్రాట్స్ చెప్పుకున్నాను.

"ఏంటమ్మా! తను ఎంతో ఇష్టపడి ఎంపిక చేసింది మీ కోసం, హనీమూన్‌లో కూడా మీ గురించే ఆలోచించింది. మీరేమో ఇలా మాట్లాడి తనని కష్టపెట్టారు"


ప్రవీణ్ మాటలకి వాళ్ళు నిజంగానే నేను ఏడుస్తున్నాననుకుని నన్ను అనునయించి వెళ్ళడం, నేను ముభావంగా వుండడం జరిగిపోయింది. ఇక అప్పటినుంచీ 'ఆపరేషన్ ఫర్ సెపరేషన్' చర్యలు మొదలుపెట్టేశాను.

ఎనిమిదింటికి నిద్ర లేచి నేరుగా వంటింట్లో సహాయానికి వెళ్తే అత్తయ్య "పాచి ముఖంతో వంటగదిలోకెందుకమ్మా! నేను స్నానం చేసి వంట చేస్తాను కదా! నాకు ఇలా వస్తే నచ్చదు" అనేది. ఆవిడే అందరికీ లంచ్ ప్యాక్ చేసి రెడీ చేసేది. తల్లికి వంటగదిలో కొద్దోగొప్పో సాయం చేసే ప్రణీత మాత్రం ఓసారి "వదినా! నువ్వెంత లక్కీనో! 'అనుకున్న అతిథి' అనెయ్యొచ్చు. కుక్-కం-సర్వెంట్ అత్తగారు, పర్మినెంట్ హెల్పర్ ఆడబడుచు"

ప్రణీతని బాగా కోప్పడింది అత్తయ్య. నేను బాధపడితే ప్రవీణ్ చెల్లెలి చేత నాకు 'సారీ' చెప్పించాడు. అయితే, నన్ను కూడా పని నేర్చుకోమని పురమాయించాడు. 'తప్పదురా' బాబూ అనుకుని రాత్రి వంట నేను చేస్తానని పూనుకున్నాను. అమ్మకి ఫోన్ చేసి అడిగితే తగిన సలహాలు ఇచ్చింది. అమ్మ తెలివితేటలు చాలా గొప్పవి. ఇంటికి పెద్దకోడలైనా నాయనమ్మని బాబాయి వాళ్ళింట్లోనే వుంచేటట్లుగా పెళ్ళైన కొత్తల్లోనే తగిన జాగ్రత్తలు తీసుకుందట. నాయనమ్మ వచ్చినప్పుడల్లా తలనొప్పో, మరోటో చెప్పి పడుకోవటం, పనిమనిషిని

ఆవిడ ఉన్నన్నాళ్ళూ రావద్దని చెప్పడం చేసేదట. అసలే కీళ్ళనొప్పులతో బాధపడే నాయనమ్మ నాలుగోరోజు కల్లా జెండా ఎత్తేసేదట.

రాత్రిపూట చపాతీకి గోధుమపిండిని దోసెలపిండిలా కలిపానోరోజు. బియ్యంలో నీళ్ళే పొయ్యకుండా కుక్కర్‌లో పెట్టి కుక్కర్ మొత్తం మాడ్చే శానింకోరోజు. చింతపండు రసం తీయమంటే, రసం పారబోసి పుల్తి పిప్పిమాత్రం మిగిల్చి చారు



ఓ సారీ, ఉప్పు, కారం లేని కూరలు మరో సారీ, అదేమిటంటే విపరీతంగా ఉప్పో, కారమో వేసి ఇంకోసారీ నా పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని చూపించాను. నా దెబ్బకి అదిరిపోయిన అత్తయ్య, నన్ను హాయిగా రెస్టు తీసుకోమని చెప్పి తనే చేసుకునేది. ఇంటి పనులు కూడా ఒక పద్ధతి ప్రకారం పాడుచేయడంతో విసుగేసి ఆవిడ, మామగారూ కూడా ఓ మాట అనడం, నేను గదిలో కూర్చుని ఏడవడం, ప్రవీణ్ సముదాయించడం మామూలైపోయింది.

"నా వల్ల కాదు, ఈ సాధింపులు, సతాయింపులు నా వల్ల కాదు, ఎంత ఓర్చుకున్నా మీ చెల్లెలు, అమ్మ ఏదో ఒకటి అంటూనే వుంటారు. నన్ను అంటరానిదానిలాగా చూస్తున్నారు. అన్నింటికీ వంకలు పెడతారు. అమ్మా నాన్న దగ్గర ఎంత అపురూపంగా పెరిగానో! ఈ నరకంలో నేనుండలేను. చచ్చిపోవాలనిపిస్తోంది" వెక్కి వెక్కి ఏడుస్తున్న నన్ను చూసి ప్రవీణ్ కూడా ఏడ్చాడు.

తెల్లారింది.

"అమ్మా! ఇరవయ్యేళ్ళు మరో ఇంట్లో పెరిగిన మనిషి మన పద్ధతులకి అలవాటుపడాలంటే టైం పడుతుంది కదా! మనతో కలవనీయకుండా అలా విడిగా వుంచుతే తనెంత బాధపడుతుంది? మీ సూటిపోటి మాటలకి బాధపడి తనేదైనా అఘాయిత్యం చేసుకుంటే! ఇలా అయితే ఎలా?" తల్లితో అంటున్నాడు ప్రవీణ్.

"ప్రవీణ్! ప్రొద్దున్న వెళ్ళి రాత్రికి వచ్చే నీకు ఇంట్లో సంగతులు తెలియవు. నేనెన్నడూ ఆ అమ్మాయిని ఏమీ అనలేదు. అయినా ఇప్పుడు చెబుతున్నాను విను. మణికి పని నేర్చుకునే అభిరుచి లేదు. నేర్పే తీరిక మీ అమ్మకి లేదు. ఇక మాటలు అంటావా! రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు. ఒక వైపు విని నిర్ధారించుకోకు. చేతనైతే ఆ అమ్మాయిని మనలో కలిసిపోయేలా మార్చు. లేకపోతే ఈ రగడ రోజూ వుంటుంది" మామయ్యగారు గంభీరంగా అన్నారు.

సరిగ్గా నాలుగురోజులు గడిచాయో లేదో, ప్రవీణ్ తల్లిని, తండ్రిని పిలిచి కూర్చోబెట్టాడు. ఆఫీసు నుంచీ ఇల్లు ఎంత దూరమో చెప్పాడు. ఇటీవల పెరిగిన ఆక్సిడెంట్స్ గురించి చెప్పాడు. ఆఖరిగా ఆఫీసుకి దగ్గరలో తను అద్దె ఇల్లు తీసుకున్నట్లు, వేరేగా కొత్తకాపురం పెడుతున్నట్లు చెప్పాడు.

"ఇదేం పనండీ? అత్తయ్యగార్ని వదిలి నేను రాను. అందరం కలిసే వుందాం. ప్లీజ్! పెద్దవాళ్ళన్నాక వాళ్ళు అనాలి, నేను పడాలి" అంటూ భోరుమన్నాను, గదిలో. ప్రవీణ్ ఒప్పుకోలేదు.

నా కోర్కె ప్రకారం నా ఇంటికి నేనే ఇప్పుడు రాణిని.

* * *

నాకు వచ్చిన అనుమానం నిజమే అయింది. రెండో నెల నడుస్తోంది నాకు. తెగ నీరసం, కళ్ళు తిరగడం, వాంతులు- మార్నింగ్ సిక్‌నెస్ అంటారట దీనిని. ఏ పనీ చెయ్యలేకపోతున్నాను. అమ్మ దగ్గర వున్నన్నాళ్ళూ ఏ పనీ నేర్చుకోకపోవడంతో అలవాటులేని పనులతో ఈ నెలరోజుల్నించీ అలసట బాగా ఎక్కువయింది. మొదట్లో హోటల్ నుంచీ టిఫిన్లూ, భోజనమూ పార్శిల్స్ తెచ్చే ప్రవీణ్ ఈ మధ్య నన్ను విసుక్కోవడం మొదలుపెట్టాడు. నన్ను పెంచిన అమ్మా నాన్నల్ని అతను తిడుతూంటే, ఊరుకోలేక నేనూ వాదిస్తున్నాను. ఏతావాతా కొత్త సంసారం గొప్పగా లేకపోగా మహా ఇబ్బందిగా వుంది. వసంతక్కతో ఫోన్లో చెప్పాను.

"అత్తారింట్లో పని తప్పించుకోమన్నాను కానీ, నీకు అసలు పనే గిట్టదని నాకు తెలీదే! తప్పదు. ఇంటి పని నేర్చుకో! మరో నాల్రోజుల్లో బాబో పాపో పుడితే ఆ పని కూడా చేసుకోవాలి కదా! వీలున్నప్పుడు నేను వస్తాలే!" అంది.

నా గుండె ఝల్లుమంది. అంటే ఇక నుంచీ పిల్లలకి

ఎన్నెన్ని పనులు చేయాలో! ఏదో ముద్దొస్తే ఎత్తుకోవడం, కార్లో షికార్లు తిప్పడం వరకూ ఓ.కే. ఆ ఛందాలాలన్నీ ఎవరు చేస్తారు? నా వల్ల కాదుబాబోయ్!


అమ్మకి ఫోన్ చేశాను.

"అమ్మా! వచ్చెయ్యవే! నాతోనే వుండు. ప్లీజ్"

"ఇది మరీ బావుంది. నాకు సంసారం లేదూ! మీ వదిన నిన్నుమించిన పనిమంతురాలు. గదిలోనుంచి బైటికే రాదు. నేనూ మీ నాన్నా అన్నయ్య మీదే ఆధార పడి వున్నాం కదా! నాకీ చాకిరి తప్పదు. కావాలంటే నువ్వేరా! నాల్రోజులుండి వెళ్ళు"

అమ్మ మాటలకి నాకు దిమ్మ తిరిగింది. ఈ మధ్యే అన్నయ్యకి పెళ్ళయ్యింది. పాతిక లక్షల కట్నంతో కలిగినింటి నుంచీ వచ్చింది వదిన. మా వాళ్ళేం నయా పైసా కట్నం తీసుకోకపోగా రెండు లక్షల రూపాయిలు ఇచ్చి బంగారం, బట్టలు కొనుక్కోమన్నారు.

అమ్మ దగ్గరికి వెళ్ళిన రెండో రోజే నాకు పరిస్థితి అర్థమయింది. అమ్మ తెలివితేటలు వాళ్ళ అత్తగారి దగ్గర తప్ప తన కోడలి దగ్గర పనిచెయ్యడం లేదని. అంతరంగిక సేవకురాలిలాగా కోడలికి సపర్యలు చేస్తోంది అమ్మ. వదినని అద్దాల అలమారలోని బొమ్మలాగా అపురూపంగా చూసుకుంటున్నాడు అన్నయ్య. ఎవరూ ఏమీ అనకపోయినా, నాకు నేనే పరాయిదాన్నిలాగా అనిపించింది నాకు. నేను పుట్టిన ఈ ఇల్లు, నా వాళ్ళు అందరూ పరాయిగానే తోచసాగారు. వదిన అభిజాత్యం, అహంకారం నన్ను అక్కడ వుండనీలేదు. తిరిగి వచ్చేశాను.



నెలలు నిండుతున్నాయి. అత్తయ్య వచ్చి ఇంటికి తీసికెళ్ళి సీమంతం చేసింది. పుట్టింటికి పురుడు కోసం చేరాను. పాప పుట్టింది. చాలా చాలా బలహీనంగా వుంది.

"పాప జాగ్రత్త! ఎంతో కేర్‌ఫుల్‌గా చూసుకోవాలి. త్వరగా ఇన్‌ఫెక్షన్స్ సోకుతాయి. శుభ్రంగా వుంచాలి. డాక్టర్ సంరక్షణ, దగ్గరగా వుండాలి" అంటూ ఏమేమో చెప్పాడు డాక్టర్.

"అమ్మా! ప్లీజ్! నాతో రావా! దీన్ని ఎత్తుకోవాలంటేనే నాకు భయమేస్తోంది" మూడో నెల వచ్చాక ఇంటికి బయల్దేరుతూ అడిగాను అమ్మని. అమ్మ 'సరే' అనబోతుండగా వచ్చాడు అన్నయ్య.

"అదెలా కుదురుతుందే? మీ వదినకిప్పుడు ఆరో నెల కదా! అమ్మ సాయం లేకపోతే ఎలా? నువ్వే ఏదో తంటాలు పడు"

నాకు కన్నీళ్ళు తిరిగాయి.

పని, పని, పని, పాప అవసరాలు, ఇంటి పనులు దాదాపుగా ప్రతి మూడోరోజూ డాక్టర్ దగ్గరికి ప్రదక్షిణలు. ప్రవీణ్ ఎంత సాయం చేసినా, అలవాటు లేని శ్రమతో నాకు ఊపిరే ఆడడం లేదు.

"ప్రవీణ్! అత్తయ్య వస్తారేమో! కొన్నాళ్ళపాటు నాకు, పాపకి తోడుగా వుంటారేమో! పిలిపిస్తారా!" ఆశగా అడిగాను.

"ఛ! ఒద్దు. ఒక్కగానొక్క కొడుకుని నేను. నీ కోసం బుద్ధి గడ్డి తిని వాళ్ళని వదిలి వచ్చాను. ఇప్పుడు నా అవసరానికి పిలిస్తే అంతకన్నా చెడ్డపని మరోటుండదు. పైగా అమ్మకి ఉద్యోగం కదా! ఎలా మానేస్తుంది? నాన్న, చెల్లాయి కూడా రావాల్సొస్తుంది. అది నీకు నచ్చదు. అది జరిగే పని కాదులే!" అనేశాడు ప్రవీణ్.

వసంతక్కని సాయం రమ్మని అడిగాను.

"అమ్మో! నా మొగుడూ, పిల్లలూ - వాళ్ళని వదిలి రావడమా! అదెలా కుదురుతుందే!" మొండి చెయ్యి చూపించింది.

నా మీద నాకే జాలి కలుగుతోంది. ఒక్కమాట కూడా అనకుండా పని చేసిపెట్టే అత్తయ్యని వదిలి వచ్చిన నాకు నా మీదే అసహ్యం వేస్తోంది. రాత్రిళ్ళు నిద్రపోనీకుండా ఏడ్చే పాపాయిమీదా, అదేమీ పట్టకుండా హాయిగా నిద్రపోయే ప్రవీణ్ మీదా, పనిమనిషి మీదా లేని పోనివి చెప్పి నా మనసుని పాడు చేసిన అమ్మ, అక్కల మీదా, సొంతంగా ఒక్క పనీ చేయలేని నా ఒళ్ళు బద్ధకం మీదా- ఇలా ఒకటేమిటి - లోకం మొత్తం మీదా కోపం వస్తోంది. దుఃఖం వస్తోంది. ఈ రాణీవాసంలో సంతోషమెంతో బాగా తెలిసొచ్చింది.

* * *

ప్రొద్దున్నే కాలింగ్ బెల్ రింగ్ అయితే పాలబ్బాయేమో అని తలుపు తీసిన నాకు దేవత ప్రత్యక్షమయింది.

బట్టల సంచీ, బొమ్మల కవరుతో అత్తయ్య.

"చిట్టి పాపాయితో ఎంత చిక్కిపోయావు మణీ! ఒక్కదానివీ ఎలా చూసుకోగలవు? మనసు వుండబట్టలేక కొన్నాళ్ళుందామని మీ మామగారు వద్దన్నా వచ్చేశాను. ఆఫీసుకి శెలవు పెట్టేశాను. నీకిష్టమైతే ఇక్కడుంటాను. లేదా మనింటికి తీసికెళ్ళిపోతాను"

ఇప్పుడొచ్చాయి నాకు నిజమైన కన్నీళ్ళు. అలలు అలలుగా. కరిగిపోయిన పొరలేవో కన్నీరుగా మారి ఆవిడ పాదాలని అభిషేకిస్తుంటే కెవ్వుమన్న ఉయ్యాల్లో పాపాయి కోసం పరిగెత్తింది అత్తయ్య.

○

## పాటలు పాడతా

ఇటీవల తెలుగులో లీడర్, రామరామ కృష్ణ కృష్ణ చిత్రాల్లో నటించిన ప్రియా ఆనంద్ అటు తమిళంలోనూ బిజీగానే వుంది. తాజాగా ఆమె పాటలు పాడ్డానికి కూడా సిద్ధమైందిట. ఓ తమిళ చిత్రంలో ఆమె పాట పాడి శభాష్ అనిపించుకుందని కోలీవుడ్ జనాల ఉవాచ. హీరోయిన్-సింగర్‌లు కూడా ట్రయ్ చేసిన వాళ్లు గతంలో వున్నారు. మమతా మోహన్‌దాస్ కూడా నటనతోపాటు, పాటలు పాడ్డం కూడా చేసింది. అఫ్‌కోర్స్, ఆమెకి తర్వాత తర్వాత పాటల చాన్సులు తగ్గిపోయాయి అది వేరే సంగతి. అయితే ప్రియ మాత్రం తనకి ఏమాత్రం అవకాశం వున్నా పాడాలని అనుకుంటోందిట.